

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**ఒక ఏడాదికాలం** కడపలో పనిచేసి తర్వాత హైదరాబాద్‌కి తిరిగి వచ్చాను. వచ్చాక నన్ను నాటక విభాగానికి అధిపతిగా నియమించారు. 1989నించీ నేను రిటైరయ్యేదాకా అంటే 1997 జూన్ నెలాఖరుదాకా నాటక విభాగంలోనే పనిచేస్తూ ఆ వ్యవధిలో సుమారు పదిహేనుసార్లు ఆడిషన్లు నిర్వహించి, మంచి కంఠస్వరం, స్వచ్ఛమైన ఉచ్చారణ కలిగిన దాదాపు నూటయాభై మందిని ఆర్టిస్టులుగా ఎంపిక చేయటం జరిగింది.

అంతేకాదు అప్పటికే 'బి - హై' ఆర్టిస్టులుగా వున్న శ్రీ తుర్లపాటి రామచంద్రరావు, శ్రీ సుబ్బరాయశర్మ, శ్రీ చిట్టా శంకర్, శ్రీమతులు ఎం.కె.ఆర్.ఆశాలత, ఎ. వసంతలక్ష్మి మొదలైనవారి కంఠస్వరాల్ని రికార్డు చేసి ఢిల్లీలోని ఆకాశవాణి ఉన్నతాధికారులకు పంపించి వారిని 'ఏ' గ్రేడు ఆర్టిస్టులుగా ప్రమోట్ చేయించటం జరిగింది. అలాగే ఆకాశవాణి ఆర్టిస్టులుగా ఎంతో సేవలు అందించిన శ్రీయుతులు చాట్ల శ్రీరాములు, జె.వి.సోమయాజులుగార్ల గొంతులను కూడా రికార్డు చేసి వారిద్దర్నీ 'టాప్‌గ్రేడ్' ఆర్టిస్టులుగా ప్రమోట్ చేయించటం జరిగిందని సగౌరవంగా చెప్పుకుంటూంటాను.

నేను ఆకాశవాణిలో చేరిన కొత్తలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు సెంట్రల్ వెల్‌ఫేర్ కమిటీ వారు ప్రతి ఏటా నాటిక పోటీలు నిర్వహిస్తుండేవారు. 1973లో అనుకుంటాను, ఆకాశవాణి మిత్రులు - ఆ పోటీలో పాల్గోవాలన్న కోరికతో నన్ను ఓ నాటిక రాసివ్వమని అడిగారు. అప్పట్లో అప్పట్లో 'ల్యాండ్ సీలింగ్ చట్టం' అమలులోకి వచ్చిన నేపథ్యంలో అదే ఇతివృత్తాన్ని కథా వస్తువుగా తీసుకుని 'ఈ సమాజం మారదు' అనే పేరుతో నాటిక రాశాను. అందులో నాతోపాటు శ్రీయుతులు వి. సత్యనారాయణ, దేవళ్ళ బాలకృష్ణ, ఎమ్వీవీ శశిధర్, శ్రీమతి రతన్ ప్రసాద్ మొదలైన ఆకాశవాణి ఉద్యోగులంతా నటించారు. ఆ నాటిక రాసిన నేను ఉత్తమ రచనకు బహుమతి అందుకోగా, ఉత్తమనటుడిగా శ్రీ వి. సత్యనారాయణ, ఉత్తమనటిగా శ్రీమతి రతన్‌ప్రసాద్, ఉత్తమ సహాయనటుడుగా శ్రీ ఎమ్వీవీ శశిధర్ బహుమతులు పొందారు.

ఆ తర్వాత సంవత్సరం అంటే 1974లో కూడా సెంట్రల్ వెల్ఫేర్ కమిటీ పోటీలకు నాటిక రాసిచ్చాను. దానిపేరు 'నరకుడి పునర్జన్మ' ఆ నాటికలో పాల్గొన్న శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి ఉత్తమ నటుడి బహుమతి తీసుకుంటే ద్వితీయ ఉత్తమ రచన బహుమతి నాకు లభించింది.

1985లో హైదరాబాదు ఆర్టీసీ ఆఫీసులో పనిచేసే శ్రీయుతులు చర్లకోల కృష్ణారెడ్డి, గద్వాల్ ఈరన్నలు - నా రచనా జీవిత రజతోత్సవాన్ని నిర్వహించి సన్మానం చేస్తామని వచ్చారు. (నా మొదటి కథ 1960లో ప్రచురితమైందని ఇంతకుముందే

తెలియజేశాను కదా) సన్మానాలు అంటే ఎవరికి ఇష్టం వుండదు చెప్పండి? నేను సరేనన్నాను. ఆ సందర్భంగా అప్పటికి నేను రాసిన కథల్లోంచి కొన్ని కథల్ని తీసుకుని 'జీడిగుంట రామచంద్రమూర్తి కథలు' పేరుతో ఓ సంపుటిగా ప్రచురించారు. ఆ పుస్తకం కవరు పేజీని మిత్రులు శ్రీ చంద్ర ఎంతో అందంగా తయారుచేసి ఇచ్చారు.

'మయూర' పేరుతో ఒక సంస్థను స్థాపించిన మిత్రులు కృష్ణారెడ్డి, ఈరన్నలు ఆ పుస్తకావిష్కరణ సభను త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేశారు. సభా ప్రారంభానికి ముందు ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శ్రీ హరికిషన్ తన ప్రతిభను ప్రదర్శించి సభికుల్ని రంజింపచేశారు. అప్పటి సభా సామ్రాట్ శ్రీ కె.వి. భాస్కరరావుగారు అధ్యక్షత వహించిన ఆనాటి సభకు అప్పుడప్పుడే పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటున్న 'శంకరాభరణం శంకర శాస్త్రి'గారైన శ్రీ జెవి సోమయాజులుగారు గౌరవ ముఖ్య అతిథిగా పాల్గొని కథల సంపుటిని ఆవిష్కరించారు. శ్రీయుతులు పన్యాల రంగనాథరావు, ఆదివిష్ణు, ఎల్లోరా, చంద్ర, శ్రీమతి రతన్ ప్రసాద్ ప్రభృతులు ప్రసంగించిన ఆనాటి సభలో నన్నూ నా శ్రీమతినీ కూడా సన్మానించారు. సన్మానసభ అనంతరం అప్పుడే సినీరంగ ప్రవేశం చేసిన శ్రీ కోట శ్రీనివాసరావు ప్రధాన పాత్రధారిగా "ముఖం చూసి మాట్లాడు" పేరుతో నేను రచించిన నాటికను ప్రదర్శించారు. శ్రీమతి కె. రత్నాసాగర్ కూడా ఆ నాటికలో ముఖ్యపాత్రను పోషించారు.

మొత్తానికి నేను కూడా రంగస్థలానికి ఆ విధంగా నాటికలు రాయగలనన్న ధీమా నాలో ఏర్పడింది. తర్వాత చాలా కాలానికి, ప్రముఖ రంగస్థల, టీవి, సినీనటులు శ్రీ సుబ్బరాయశర్మ నాచేత చాలా నాటికలు రంగస్థలానికి రాయించారు. ఈ విషయంలో ఆయన నాకు ఇచ్చిన ప్రోత్సాహాన్ని నేను ఎన్నటికీ మరిచిపోలేను. అపుడపుడు ప్రచురితమయ్యే నా కథల్ని చదివి, వాటిలో ఏదైనా రంగస్థల ప్రదర్శనకు బాగుంటుందని ఆయనకు అనిపిస్తే 'ఆ కథని స్టేజికి రాసివ్వండి గురూజీ' అని అడిగేవారు. నేను రాసివ్వగానే కావలసిన మార్పులూ చేర్పులూ చేయించి, ఆయనే దర్శకత్వం వహించి, స్థానిక త్యాగరాయగాన సభ వేదికపై ప్రదర్శింపజేసేవారు.

1990లో అనుకుంటాను ఓ ఆదివారంనాడు ఈనాడు అనుబంధంలో నేను రాసిన 'దుర్మార్గం' అనే కథ చదివిన శ్రీ శర్మ, దాన్ని నాటికగా రాసివ్వమని అడిగారు. 'డాడీ యూ ఆర్ గ్రేట్' అనే పేరుతో ఆ కథను నాటికగా రాసిచ్చాను. ఆ తర్వాత కొన్నాళ్ళకు నేను 'సితార' పత్రిక కోసం ధారావాహికంగా రాసిన సినీ నవల 'బావా బావా పన్నీరు'ను ప్రచురించుకుని, కిన్నెర సంస్థ నిర్వాహకులూ, నాకు అత్యంత ఆత్మీయ మిత్రులూ అయిన శ్రీ మద్దాలి రఘురాంగారిని, ఆ నవల ఆవిష్కరణ సభను ఏర్పాటు చేయమని అడిగాను. 1991లో ఆ నవల ఆవిష్కరణ సభను ఏర్పాటు చేయగా, సభా ప్రారంభానికి ముందు, నేను రచించిన సదరు నాటిక 'డాడీ! యూ ఆర్ గ్రేట్'ను శ్రీ సుబ్బరాయశర్మగారు ప్రదర్శింపజేశారు. ఆయనే దర్శకత్వం చేపట్టి, అప్పటి సమైక్య భారతి సత్యనారాయణ, శ్రీమతి నాగమణి ప్రధాన పాత్రలు పోషించిన ఆ నాటిక విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఆవిష్కరణకు సభకు విచ్చేసిన శ్రీనారాయణ రెడ్డిగారు ఆ నాటికను ఆసాంతం చూసి 'చాలా సున్నితమైన కథా వస్తువుని తీసుకుని నాటికగా మలచిన నన్ను అభినందించారు' ఆవిష్కృతమైన 'బావా బావా పన్నీరు" నవలను ఆనాటి సభలో శ్రీ జంధ్యాలగారికి అంకితం ఇచ్చాను.

అటు తర్వాత ఆంధ్రప్రభ వార పత్రికలో నేను రాసిన 'గోదానం' అనే కథ కూడా స్టేజికి బాగుంటుందని శ్రీ శర్మగారు చెబితే - 'అశ్రుఘోష' పేరుతో నాటకంగా రాసిచ్చాను. శ్రీజి.బి రామకృష్ణశాస్త్రి శ్రీమతి ఇందిర ప్రధాన పాత్రధారులుగా ఆ నాటకాన్ని 1996లో రవీంద్రభారతి వేదికపై ప్రదర్శించారు. ప్రేక్షకులంతా హర్షధ్వానాలతో ప్రదర్శన ఎంతో బాగుందని నన్ను, కళాకారుల్నీ ఎంతగానో అభినందించారు.

ఆ అశ్రుఘోష నాటకాన్ని 1997-98 ప్రాంతాల్లో జరిగిన నంది నాటకపోటీలలో ప్రదర్శించమని నేను శ్రీ రామకృష్ణ శాస్త్రిగార్ని కోరాను. అయితే ఆ నాటకంలో ఆయనతోపాటు మరో ప్రధాన పాత్ర పోషించిన శ్రీ కామేశ్వరరావుగారు అందుబాటులో లేకపోవడంవల్ల, ఆయన దాన్ని నంది పోటీలకు ఇవ్వలేకపోయారు. నా రంగస్థల మిత్రులు శ్రీ చిట్టా శంకర్ గారికి ఆ నాటకాన్ని ఇచ్చి నంది పోటీలకు 'ఎంట్రీ'గా ఇవ్వమని అడిగాను. ఆయన అందుకు అంగీకరించి 1998లో జరిగిన నంది నాటకపోటీలలో తనూ, శ్రీమతి ఇందిర, శ్రీ సుసర్ల కామేశ్వర శర్మ మొదలైన వారంతా పాల్గొని ప్రదర్శించారు. ఉత్తమ నటుడిగా బంగారు నందిని అందుకున్నారు శ్రీ శంకర్. అటు తర్వాత మరికొన్ని పరిషత్తుల్లో కూడా ఆ నాటకాన్ని ప్రదర్శించి బహుమతులు తీసుకోవటం జరిగింది.

ఆ అశ్రుఘోష నాటకాన్ని పుస్తకరూపంలో ప్రచురించుకుని ప్రతి ఏడూ తెలుగు విశ్వవిద్యాలయ వారు ప్రదానం చేసే సాహితీ పురస్కారాల పోటీకి పరిశీలనార్థం పంపించాను. 2002లో ఆ నాటకానికి నేను ఉత్తమ నాటక రచయితగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులతగారి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ జానారెడ్డి చేతులమీదుగా సాహితీ పురస్కారాన్ని అందుకున్నాను.

అన్నట్టు సాహితీ పురస్కారం అంటే గుర్తుకొచ్చింది. అంతకుముందు నేను 1980-90 సంవత్సరాల మధ్యకాలంలో వేర్వేరు పత్రికలకు రాసిన కథల్లోంచి సుమారు పాతిక కథల్ని ఎందుకుని 'అమూల్యం' అనే పేరుతో ఓ కథా సంపుటిని 1998లో ప్రచురించుకున్నాను. ఆ కథల సంపుటి ఆవిష్కరణోత్సవాన్ని కిన్నెర సంస్థవారే నిర్వహించారు. డా. సి. నారాయణరెడ్డిగారు ఆవిష్కరించిన ఆనాటి సభలో శ్రీయుతులు వాకాటి పాండురంగారావు, శ్రీ ఆదివిష్ణు, డా కె.వికృష్ణకుమారి ప్రభృతులు పాల్గొన్నారు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే 1999లో కాబోలు ఆ కథాసంపుటికి కూడా అప్పటి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ ఎన్. గోపిగారి ఆధ్వర్యంలో రాష్ట్రమంత్రివర్యులు శ్రీ యనమల రామకృష్ణుడు చేతులనుంచి సాహితీ పురస్కారం లభించింది.

ఎలాగూ పురస్కారాల సంగతి ప్రస్తావనకు వచ్చింది కనుక నాటినుంచీ, నేటిదాకా నేను పొందిన పురస్కారాలు, అవార్డులు, రివార్డుల గురించి కూడా ఇక్కడే చెప్పేయాలనిపిస్తోంది.

1981లో తొలిసారిగా నన్ను రచయితగా గుర్తించి, మహబూబ్ నగర్‌లో నవజీవన రేడియో సంస్థవారు, అటు తర్వాత అభినందన సంస్థవారు, మళ్ళీ 1985లో నా రచనా జీవిత వ్యాసంగ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని 'మయూర' సంస్థవారు చేసిన సన్మానాల తర్వాత 1992లో స్థానిక యువకళావాహిని సంస్థ నిర్వాహకులు శ్రీ వై.కె నాగేశ్వరరావుగారు, గాంధీ భవన్‌లో జరిగిన వారి వార్షికోత్సవం సందర్భంగా నాకు సన్మానం చేశారు. డా. మర్రిచెన్నారెడ్డిగారి

చేతులమీదుగా ఒక మెమెంటోను ఇప్పించారు. అదే సంవత్సరంలో నాకు ఉత్తమ రచయితగా బుల్లితెర ఇసిటీవి పురస్కారం కూడా లభించింది. ఆ పురస్కారాన్ని శ్రీ బుల్లితెర నాగభూషణంగారి సారథ్యంలో తిరుపతి పట్టణంలో జరిగిన ఒక సభలో అందచేశారు.

1993లో విశ్వ సాహితి సంస్థ నిర్వాహకులు శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు నేను రచించిన 'గోదానం' కథా సంపుటానికి ఉత్తమ కథా రచయితగా నగదు పురస్కారాన్ని అందించి సన్మానించారు.

1993లోనే దూరదర్శన్‌కోసం నేను రచించిన 'ఊర్మిళ - ఉగాది కథల పోటీ' అనే ప్రాయోజిత కార్యక్రమానికి ద్వితీయ బహుమతిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రజిత నంది పురస్కారం లభించింది. ఆ పురస్కారాన్ని అప్పటి ముఖ్యమంత్రి గౌరవనీయులు కోట్ల విజయ భాస్కర్ రెడ్డిగారు అందచేశారు.

1996లో దూరదర్శన్‌లోనే పది భాగాలుగా ప్రసారమైన నా ధారావాహిక 'పునరపి'కి ఉత్తమ టెలీ ప్లే రచయితగా నేను బంగారునందిని అందుకున్నాను.

1998లో అనుకుంటాను ప్రభుత్వం సారా నిషేధాన్ని రాష్ట్రంలో అమలులోకి తెచ్చినప్పుడు అదే కథా వస్తువును ఆధారంగా తీసుకుని లఘుచిత్రాలను తయారు చేయమని రాష్ట్ర ప్రభుత్వ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ఒక పోటీని నిర్వహించారు. ఆ పోటీకోసం 'పరివర్తన' పేరుతో ఓ లఘు చిత్రాన్ని తయారుచేసి పంపించాను. దానికి కూడా ఉత్తమ రచయితగా నాకు నంది బహుమతి లభించింది.

2005లో భర్తృహరి సుభాషిత పద్యాలు ఆరింటిని తీసుకుని, వాటికి కథల్నీ, సంభాషణల్నీ సమకూర్చి పెట్టమని శ్రీ జె.వి సోమయాజులుగారు కోరటంతో ఆ ప్రకారమే రాసి వారికి అందజేశాను. ఆ లఘు చిత్రాల్ని శ్రీ బి.వి. రమణారెడ్డిగారి నిర్వహణలో నిర్మించి, పద్యాల్నీ వాటి తాత్పర్యాలనూ శ్రీ ఎస్.పి బాలసుబ్రహ్మణ్యంగారితో చదివించి దూరదర్శన్‌లో ప్రసారం కావించారు. ఆ ఆరు లఘు చిత్రాలలోను శ్రీ సోమయాజులుగారే ప్రధాన పాత్రలు పోషించారు. చెప్పవచ్చేదేమిటంటే ఆ సంవత్సరపు టివి నంది పురస్కారాల ప్రదానంలో ఉత్తమ కథా రచయితగా, రాష్ట్రమంత్రివర్యులు శ్రీ సత్యనారాయణరావుగారి చేతుల మీదుగా కరీంనగర్‌లో జరిగిన వేడుకలో నేను స్వర్ణనందిని అందుకున్నాను.

2006 సంవత్సరంలో స్థానిక జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వాహకులైన, మిత్రులు శ్రీ గుదిబండి వెంకటరెడ్డిగారు, త్యాగరాయ సభలో నన్ను సన్మానించి 'కళా కౌశల' పురస్కారాన్ని అందచేశారు. దానికి ముందూ తర్వాత కూడా శ్రీ రెడ్డిగారు నన్ను సత్కరించిన సందర్భాలు మరికొన్ని లేకపోలేదు.

ఆ తర్వాత రెండు సంవత్సరాలకు, అంటే 2008లో స్థానిక రసమయి సంస్థ వ్యవస్థాపకులైన మిత్రులు శ్రీ ఎం.కె.రాముగారు ప్రతి సంవత్సరం జరిపే పైడి లక్ష్మయ్యగారి జయంతి సందర్భంగా నాకు 'రంగస్థల' పురస్కారాన్ని అందజేశారు. శ్రీ పి. నారాయణరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆనాటి సభలో శ్రీ మురళీమోహన్ గారి చేతులమీదుగా ఆ పురస్కారాన్ని అందుకున్నాను.

నేను రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి ఏభై సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని కిన్నెర సంస్థ నిర్వాహకులు శ్రీ మద్దాలి రఘురాం, ఢిల్లీ 'తెలుగు అకాడమీ' వ్యవస్థాపకులు శ్రీ ఎన్.వి.ఎల్ నాగరాజు గార్లు నా డెబ్బయ్యవ పుట్టినరోజు (సప్తతి) వేడుకనూ రచనా జీవిత స్వర్ణోత్సవ సంబరాన్నీ ఎంతో ఘనంగా హైదరాబాద్ భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించారు. ఆ సభకు శ్రీ కె.వి రమణాచారిగారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నేను ప్రచురించుకున్న 'గుడిలో పువ్వు' కథల సంపుటిని డా.సి నారాయణ రెడ్డిగారు, 'తరంగిణి' వ్యాస సంపుటిని శ్రీ కె.వి రమణాచారిగారూ, 'తాతాధిత్తైతధికిణతోం' అనే హాస్య నవలను శ్రీ ఆదివిష్ణుగారు ఆవిష్కరించారు. ఈ సభలో డా.కె.వి కృష్ణకుమారి, శ్రీ సుబ్బరాయశర్మ, డా. ఆర్ ప్రభాకర్‌రావు, శ్రీ జె. సత్యనారాయణ (ఐఏఎస్) శ్రీ ద్వా.నా శాస్త్రి, నా మనుమడు చి వరుణ్ సందేశ్ (సినీ నటుడు) ప్రభృతులు ఉపన్యసించగా, ఆ కార్యక్రమానికి శ్రీ ఓలేటి పార్వతీశం సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ సభా నిర్వహణ సందర్భంగా నాతో రంగస్థల నాటికలు రాయించి, ఆ రచన పట్ల నాకు ప్రేరణ కలిగించిన శ్రీ సుబ్బరాయశర్మనీ, నవలా రచనపట్ల నాకు ఆసక్తిని కలిగించిన నా ప్రియ గురు మిత్రులు శ్రీ పోతుకూచి సాంబశివరావుగారినీ, అలాగే హాస్య రచనలపట్ల నాలో అవగాహనను పెంపొందింపచేసిన నా ప్రియమిత్రులు శ్రీ ఆదివిష్ణుగారిని, నేను నూతన వస్త్రాలతో సత్కరించుకుని కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

నా రచనా వ్యాసంగ స్వర్ణోత్సవ సభ అంత ఘనంగా జరగటానికి వెనకాల నా బాబయ్యగారి చిన్నకొడుకు జీడిగుంట ప్రభాకర్ కూడా వున్నాడని గొప్పగా చెప్పుకోవాలి. ఒకరోజున, ప్రభాకర్ నన్ను కలిసినప్పుడు మాటల సందర్భంలో ఇలా నా 70వ జన్మదినాన్నీ, రచనా జీవిత స్వర్ణోత్సవాన్నీ ఫలానా సంస్థలు నిర్వహిస్తున్నాయని చెపితే "ఆ సందర్భంగా నీ రచనల్ని నేను పబ్లిష్ చేయిస్తాను అన్నయ్యా" అన్నాడు. ఏదో మాటవరసకు అన్నాడు కాబోలు అనుకున్నాను. తర్వాత తన పట్టు ఒదలకుండా నన్ను పట్టుకుని, నా పుస్తకాలు మూడింటినీ ప్రచురణకు ఇచ్చి నాకు అండదండలుగా నిలిచాడు. వాని మేలు నా జీవితాంతం జ్ఞాపకం ఉంచుకుంటాను. వానికీ, వాని కుటుంబ సభ్యులకీ ఆ పరమశివుడు సదా మేలు చేయాలని కోరుకుంటాను.

మళ్ళీ ఇప్పుడు నేను అందుకున్న అవార్డులు రివార్డుల గురించి మీకు తెలియచేస్తాను.

2012 సంవత్సరంలో కిన్నెర సంస్థనుంచి స్వర్గీయ శ్రీ పులికంటి కృష్ణారెడ్డిగారి పేరిట నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని అందుకున్నాను.

2013లో టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ పక్షాన శ్రీయుతులు షరీఫ్ మహ్మద్, శ్రీ రామ్మోహన నాయుడుగార్ల ఆధ్వర్యంలో శ్రీ మురళీమోహన్ గారి చేతులమీదుగా శ్రీ బి.భీమయ్యగారి మెమోరియల్ పురస్కారాన్ని తీసుకున్నాను. (పదివేల నగదు బహుమతి కూడా.)

2014లో హైదరాబాద్ త్యాగరాయ గానసభ వేదికపై, యువకళావాహిని నిర్వాహకులు శ్రీ వై.కె నాగేశ్వరరావుగారి ఆధ్వర్యంలో నాకు వాసిరెడ్డి సీతాదేవి గారి పేరిట నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని అందజేశారు. డా కె.వి కృష్ణకుమారిగారు సభలో ప్రసంగిస్తూ రేడియో విభాగానికి నేను అందించిన సేవల గురించి ప్రస్తావించారు.

2014లోనే కిన్నెర సంస్థవారు నాకు ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

2015 డిసెంబర్ నెలలో చాట్ల శ్రీరాములు ఛారిటబుల్ ట్రస్టు సంస్థ నాకు నాటకరంగ ప్రతిభా పురస్కారాన్ని అందచేయటం దానితోబాటు పదివేల నగదు బహుమతిని ప్రదానం చేయటం జరిగింది.

అంతకుముందు 2015లోనే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి, తొలిసారి ఉగాది పండుగ చేసుకున్న నేపథ్యంలో అమరావతికి దగ్గర్లో వున్న అనంతారం గ్రామంలో భారీ ఎత్తున ఉత్సవాన్ని నిర్వహించి ప్రభుత్వం కొంతమంది ప్రముఖులకు కళారత్న బిరుదుల్నీ మరికొంతమది ప్రముఖులకు ఉగాది పురస్కారాలనూ అందచేసింది. అందులో ముఖ్యమంత్రి చేతులమీదుగా కళారత్న ప్రశంసా పత్రాన్నీ, 'హంస' పురస్కారాన్నీ వాటితో పాటు ఏభైవేల నగదు బహుమతినీ అందుకున్నాను. సాహితీరంగంలో నేను చేసిన కృషికి గుర్తింపుగా నాకు ఆ పురస్కారం లభించటం నాకెంతో సంతోషాన్ని కలుగజేసింది.

2016లో ఆరాధన సంస్థ నిర్వహకులు శ్రీ జి. వెంకటరెడ్డిగారు నాకు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా.రావూరి భరద్వాజగారి పేరిట నెలకొల్పిన సాహితీ పురస్కారాన్నీ, పదివేల రూపాయల నగదు బహుమతినీ ఇచ్చి త్యాగరాయ గాన సభలోనే సత్కరించారు.

ఇప్పుడు మళ్ళీ రంగస్థల నాటకాల ప్రస్తావనకు వస్తాను. నేను రంగస్థలానికి రచించిన నాటికల్లో నాకు విశేషమైన గుర్తింపు తీసుకొచ్చిన నాటిక 'అమ్మకో ముద్దు' దీని రచన ప్రదర్శనల వెనుక ఓ కథ వుంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments